

# తెర

శ్రీనివాసశాస్త్రి

కీర్తి శిఖరాలు నాటకం చూడడానికి ఊరి జనం అంతా అక్కడ పోగయ్యారు. స్టేజీ మీద పెట్రోమాక్సులైటుని కమ్మేసిన రెక్కల పురుగుల్లా.

ఏడాదికోసారి శ్రీరామనవమినాడు గుడి ముందు పందిరేసి మైకుపెడతారు. నాటకం, రికార్డింగ్ డాన్స్ లాంటి నాలుగైదు కార్యక్రమాలు రోజుకోటి ఏర్పాటు చేస్తారు. సీతా రాముల పెళ్ళి సంబరం ముగిసి ఆ తొమ్మిది రోజులూ వెళ్ళిన తరవాత పందిరి పీకేస్తారు. మిగిలిన చందా డబ్బుల్లో వాటాల కోసం కొట్టుకు చస్తారు. నాటకాలు, కళాసేవ అంటే ఏమిటో మళ్ళా ఏడాది వరకూ మరిచి పోతారు.

ఆ రోజు అక్కడ శ్రీరామనవమి ఉత్సవాల ఆఖరి రోజున కీర్తిశిఖరాలు నాటకం పెట్టించారు. ఆ నాటకం రాసినాయన అంతకు ముందు అందని శిఖరాలు అని మరో నాటకం రాసేరు. నిజానికి కీర్తిశిఖరాలు అందుకోవాలనే ధ్యేయంతోనే ఆయన రచనా వ్యాసంగాన్ని చేపట్టేరు. అందని శిఖరాలు నాటకం వల్ల అనుకున్న శిఖరాలేవీ అందక పోవడంతో నేరుగా ఆయన కీర్తి శిఖరాలు నాటకం రాసేసేరు. అందువల్ల కూడా ఆయనకు ఆశించిన కీర్తిశిఖరాలేవీ దక్కక పోగా చివరకు ''శిఖరాల రచయిత'' అన్న పేరు స్థిరపడిపోయింది. పోనీ ఆ రకంగా నన్నా పేరు వచ్చినందుకు కొంతలో కొంత ఆయన సంతోషించేడనే చెప్పాలి. అదన్నా నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఆయన ''అందీ అందని శిఖరాలు'' అనే మరొక నాటకం రాస్తున్నాడు ప్రస్తుతం. (సరే అది

ఆయన రాసిన తరవాత నాటకం వేసిన తరవాత జనం చూసిన తరవాత మాట కదా అంటారా? చిత్రం చిత్రం!)

అక్కడ ప్రస్తుతం కి త్రిశిఖరాలు నాటకం వేస్తున్న స్టేజీ ముందు అంతా చిన్నపిల్లలు కూర్చున్నారు. వాళ్ళలో కొందరికి చొక్కాల్లేవు. కొందరికి లాగుల్లేవు. కొందరి లాగులు చొక్కాలకి బొత్తాలులేవు. అందరికి జానంత కడుపులున్నాయి. ''ఊరవతల గుడి కాడ నాటకం అవుతున్నాదంట. ఆకలో... ఆకలో అంటూ నన్ను సంపకపోతే అడకి పోయి ఆడుకోరాదూ'' అని తల్లులు కొట్టి తరిమేసిన పిల్లల్లా ఉన్నారు వాళ్ళు.

ఆ పిల్లల వెనక నాలుగైదు బెల్‌బాటమ్ ఫేంట్లు, ఏడెనిమిది గళ్ళ లాల్చీలు పది పదిహేను బట్టతలలు కనిపిస్తున్నాయి. ఊళ్ళో నాటకానికైనా రాలేదని ఆర్గనైజర్ల చేత మాట పడడం ఇష్టంలేక తప్పనిసరై అక్కడికి వచ్చిన వాళ్ళలా ఉన్నారు వాళ్ళు.

వారికి అనింటా కూర్చున్న కిర్రుచెప్పులు, తలపాగాలూ, చేతి కర్రల వాళ్ళ నోళ్ళల్లో లంక పొగాకు చుట్టలు కాలుతున్నాయి. మనం చూడబోయే నాటకంలో ''కామిగ్గాడు'' ఉన్నాడా లేడా అన్న బాధ వాళ్ళకున్నట్టుంది. నాటకానికి సంబంధించినంత వరకూ మరింకేం బాధా వాళ్ళకు లేనట్లుంది.

వీరందరికీ దూరంగా ఓ మూల గుడి ప్రహరీ గోడకి ఆనుకొని కూర్చొన్న స్త్రీ జనం తాము చూడబోయే నాటకంలో హీరోయిన్ కష్టాలకి కరిగి నీరైపోయి, హీరోగారి ధైర్య స్థైర్యాలకి ఆశ్చర్యపడిపోయి, విలన్‌గారి దుష్టచేష్టలని దుమ్మెత్తి పోయడానికి ఏ క్షణంలోనైనా సరే తయారుగా ఉన్నట్టున్నారు.

అంతలో ''తెర తీద్రేటా ఈ పూటకి?'' అని ఓ తలపాగా అతను చెడ్డ చిరాకైపోయాడు. ''రంగు లద్దుకోనీ వాయాట్టల్లని - సిటం నిద్దరోరా తెర తీసే సమయానికి లెగుద్దుగాని'' అని మరొక తలపాగా అతను చుట్ట నోట్లోంచి బయటకు తీసి సలహాయిచ్చి మళ్ళా చుట్ట నోట్లో పెట్టుకున్నాడు.

''హీరోయిన్ కమల వచ్చిందిరా'' అని ఓ బెల్‌బాటమ్ యజమాని మరో బెల్‌బాటమ్ యజమాన్నడిగేడు. రామం అని పిలువబడే ఆ మొదటి బెల్‌బాటమ్ యజమాని హీరోయిన్ కమలని పూర్వం ఆమె కాలేజీ విద్యార్థినిగా ఉండే రోజుల్లో ప్రేమించేడు. తోటి విద్యార్థిని అనీ, ఇంటి పక్క అమ్మాయనీ, బీదపిల్ల అనీ, అందంగా ఉంటుందనీ, ఆమెకి ముసలితండ్రే తప్ప అన్నయ్యలెవరూ లేరనీ, అంతా సరిగ్గా అనుకూలంగా ఉందనీ అన్నిటికీమించి తన కిప్పుడో ''ప్రేయసి'' చాలా అవసరమనీ అనిపించి అతనో రోజున చక్కగా ఫేంటులో బొమ్మల చొక్కా టక్

---

**ఏది సత్యం?**

పేదరికానికి ఎన్నో కొలమానాలు. కొందరు పేదరికాన్ని ఒక కొలమానంతో లెక్కేస్తే మరి కొందరు మరొక కొలమానంతో అందుకు భిన్నమైన లెక్కలు కట్టే అవకాశం ఉంది. 1974వ సంవత్సరానికి నేషనల్ సాంపుల్ సర్వేవారు ప్రకటించిన అంకెల ప్రకారం మనదేశంలో గంజికి కూడా గతిలేని నిరుపేదలు అన్ని రాష్ట్రాల కంటె తమిళనాడులో అత్యధికంగా ఉన్నారని తేలింది.

---

చేసుకుని బూట్లు వేసుకుని ఆమెకు ఎదురు వెళ్ళి, వెంటబడి చిన్న నవ్వు విసిరి అందంగా స్టయిల్‌గా "కమల్... నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పే(సే)డు. అతను అందంగా ఉన్నాడనీ, అతని బెల్ బాటమ్ ఫేంటు చక్కగా అతనికి అతికినట్లు సరిపోయిందనీ, మనిషి తెల్లగా నవ్వుతుంటే పలువరస తెల్లగా "కమల్ నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అన్న అతని మాట ఎంతో చల్లగా అనిపించడంతో బాటు తన పేద ముసలి తండ్రి తనకి చచ్చినా ఈ జన్మలో పెళ్ళి చేయలేడని ఆమెకి గుర్తు రావడంతో మరోసారి అతను తన వెంటబడి నప్పుడు తానుకూడా చిన్న నవ్వు విసిరింది. విసరుకొన్న నవ్వులు విరిసేయి. ప్రేమ జల్లులు కురిసేయి. వారి మేనులు అలా ఎన్నోసార్లు తడిసేయి. పెళ్ళి అయిపోయేదే వాళ్ళిద్దరికీ-మధ్యన పట్నం, అంతస్తు అడ్డుగోడలు కాకపోతే. "నేను ఆమెనే ప్రేమించాను. ఆమెను తప్ప మరెవ్వరినీ పెళ్ళిచేసుకోను" అని రామం కూడా తండ్రికి గట్టిగా చెప్పేసేవాడే-తన తండ్రి తనకి ఆస్తిరానివ్వడేమో నన్న భయం లేకపోతే. అడ్డుగోడలు అలాగే ఉన్నాయి. రామం భయం భయంలాగే ఉంది. ఫలితంగా కమలకి జీవితంమీద విరక్తి, రామానికి లక్ష రూపాయల ఆస్తీ మిగిలాయి. కమల తండ్రి పోతూ పోతూ ఓ నాటకాల కంపెనీ ఆసామీ చేతుల్లో పెట్టిపోయేడు. ఆ ఆసామే కమలకి అన్నీ అయి జాగ్రత్తగా చూసుకుంటూ వస్తున్నాడు. కమల ఆ విధంగా హీరోయిన్ కమల అయింది. రామం మాత్రం కమలని వదిలేసినా హీరోయిన్ కమలమీద మోజును వదులుకోలేదు. అప్పుడప్పుడు ఆమె నటించే నాటకాలు చూడ్డంకోసం తప్పనిసరిగా వస్తూంటాడు. ఆ రోజు అలాగే అతను "ఫటా ఫట్ ధనా ధన్" సినిమాని త్యాగం చేసి హీరోయిన్ కమల కోసం కీర్తి శిఖరాలు నాటకం వేసే స్టేజీ దగ్గర కొచ్చేడు. తీరా ఆమె రాలేదేమో, తాను అనవసరంగా సినిమాని త్యాగంచేసి నాటకానికి వచ్చేడేమో అని సందేహం వచ్చి "హీరోయిన్ కమల వచ్చిందిరా?" అని మిత్రుణ్ణడిగేడు.

మిత్రుడు ఆ ప్రశ్నకి చిన్న నవ్వు నవ్వి "హీరోయిన్ కమలా, ఒచ్చిందిరా. ఒచ్చింది. మనూరే ఇది వరకు మల్లే అమృతంలా ఊరిన వడియంలా లేదురా" అని పెదిమ విరిచేడు. "నూనెలో మాడిన వడియంలా ఉంది" అని కొంచెం హాస్యం గుప్పించి

### గోడమీద వ్రాతలు

పశ్చిమ జర్మనీలోని స్టట్‌గార్ట్ విశ్వ విద్యాలయ ఆవరణలోని మైదానంలో ప్రత్యేకంగా నిర్మించబడిన ఒక పెద్ద గోడ అక్కడి విద్యార్థులకు, విద్యార్థినులకు, పరువంలో ఉన్న యువతీ యువకులకు ఎంతో ఉపయోగ పడుతున్నది. తన ఫ్లాట్ అమ్మకానికి ఉందని ఒక విద్యార్థి గోడమీద ప్రకటిస్తాడు; రానున్న సెలవురోజున తనతోపాటు హాయిగా కాలక్షేపం చేయడానికి ఓ అందమైన అమ్మాయి కావాలని రసికుడైన ఇంకొక విద్యార్థి ఇదే గోడ మీద తన కోరికను స్వేచ్ఛగా వెల్లడిస్తాడు; తన గదిలో సహజీవనానికి ఒక విద్యార్థి. కావాలని మరొక విద్యార్థిని ఈ గోడ మీదనే తన అవసరాన్ని వ్యక్తం చేస్తుంది; స్టట్‌గార్ట్ విశ్వ విద్యాలయ యువతీ యువకుల హృదయాలకు ప్రతిబింబం ఈ గోడ...

సమాధానం ఇచ్చేడు. దానితో రామంనూనెలో మాడిన వడియా లంటే అసలు గిట్టని వాడిలా ముఖం చిట్లించేడు. అంతలో "ప్రేక్షకులారా" అంది మైకు.

"మా కీర్తి శిఖరాలు నాటకం మరి కొద్ది నిమిషాల్లో ప్రారంభించబోతున్నాం" అంటూ నాటకం బృందం తాలూకు ఆసామి చాలా గర్వంగా మరి కొద్ది నిమిషాల్లో పూల వాన కురిపించబోతున్నట్టుగా మైకులో అన్నాడు.

మరి కొద్ది నిమిషాల్లో పూలవాన కురియ లేదుగాని తెరతొలిగి స్టేజీ ఆవురు మంటున్న జంతువులా నోరు తెరిచింది.

జనం ఎక్కడి వారక్కడ నిశ్శబ్దం అయి పోయేరు.

అంతా స్టేజీకేసి చూస్తుండి పోయేరు.

స్టేజిమీద నటుడు రంగారావుగారు రంగ ప్రవేశంచేశారు. ఒకసారి ప్రేక్షక లోకాన్ని చుట్టూ కలయచూసి నటుడు రంగారావుగారు కీర్తిశిఖరాలు హీరో కిరణ్‌గా మారిపోయే ప్రయత్నంలో హఠాత్తుగా ముఖానికి గాంభీర్యాన్ని పులుముకుని భుజాలు ఎగరేసి డైలాగ్ కోసం కంఠం విప్పేరు.

ప్రేక్షకులు ఉత్సాహం పుంజుకున్నారు. డైలాగ్ కోసం నోరు తెరిచిన నటుడు రంగారావుగారి నోట్లోంచి డైలాగ్ రాబోయే సమయంలో దగ్గొచ్చింది. ఇది స్టేజీ అని, తన ముందున్నది ప్రేక్షకులని, తాను హీరో కిరణ్ అనీ అందుచేత తానిప్పుడు దగ్గకూడదనీ గుర్తు తెచ్చుకుని ముందు కొస్తున్న దగ్గుని వెనక్కి తోసి, వెనకబడి పోయిన డైలాగుని ముందుకి రప్పించ బోయేరు రంగారావుగారు. ఈ ప్రయత్నంలో నిమిషాలు నడిచాయి. ఆయన ముఖం మీదనుంచి చెమట బిందువులు దొర్లాయి.

జనంలో గుసగుసలు బయలు దేరాయి. సన్నగా నవ్వులు ప్రారంభ మయ్యాయి.

నటుడు రంగారావుగారు ప్రేక్షకులను చూసి వణికిపోతూ, సన్నగా దగ్గుతూ నిలబడి పోయారు.

జనం అరిచేరు. గోల చేసేరు. అప్పుడు తెర వెనుక ప్రాంప్టింగ్ ఇచ్చే ఆసామీ జనం కేకలు విని "ఓహో నేనిప్పుడు ప్రాంప్టింగ్ ఇవ్వాలన్నమాట" అని తెలుసు కొన్నవాడై "రాధా ... నాకింత ద్రోహం చేస్తావా?" అని డైలాగు అందించేడు.

"మంచి నీళ్ళివ్వరా మంచినీళ్ళివ్వరా" అని నటుడు రంగారావుగారు అసహాయంగా అడిగేరు.

"ద్రోహం చేస్తావా ?" అంటూ ప్రాంప్టింగ్ ఆసామీ గొంతు చించుకున్నాడు.

"ఒరేయ్ మంచినీళ్ళురా ...దగ్గురా ... ఛస్తున్నారా... అని రంగారావుగారు దీనంగా జాలిగా అడిగేరు.

ఈలోగా జనం రెచ్చి పోయేరు. లేచి నిలబడి చేతులూపుతూ కోపంగా ఏదో అడిగేరు.

కొందరు చెప్పులు విసిరేరు. కొందరు రాళ్ళు విసిరేరు. నటుడు రంగారావుగారిలో హీరో కిరణ్ ఓడిపోయాడు. సగటు తెలుగు నటుడే మిగిలి పోయేడు. దానితో ఆయన దగ్గి దగ్గి భళ్ళున వాంతి చేసుకుని నీరసంగా వేళ్ళాడిపోతూ స్టేజీ మీద ఒరిగిపోయేరు.

నటుడు రంగారావు గారిది పెద్ద కుటుంబమూ, కుటుంబ సభ్యులందరికీ ఆకలి జబ్బూ ఉందని చాలా మందికి తెలియదు. అలా తెలియని వాళ్ళలో ఒకరు.

"ఒరే! మహా నటుడు రంగారావు స్టేజీ మీద చచ్చేడ్రా?" అని అరిచేడు.

"హిప్పీ హిప్పీ షేక్ షేక్ డాన్స్ చేసేడు కదరా దగ్గుతూను. 'మరింకంతే నాటకం ఈయాల్టికి' అని మరొకతను వెటకారంగా అన్నాడు.

అంతలో లైట్లు ఆరిపోయాయి. కరెంట్ కట్, అంతా సంతగోల.

"బాగు బాగు"

"అన్నీ తగినట్టుగా ఉన్నాయి. లైట్లు కూడా ఆరిపోయాయి" లాంటి మాటలు వినవచ్చాయి.

జనం వెళ్ళిపోయేరు చాలా మంది.

* * *

ఆ తర్వాత నటుడు రంగారావుగారు అలా దగ్గుతూనే ఆ రోజు యాక్టు చేసేర్ట. నాటకం అంతా అభాసు పాలయిందట.

జనం ఆ వింతని చాలా రోజులు చెప్పుకున్నారు.

నటుడు రంగారావును తలుచుకొని తలుచుకుని నవ్వుకున్నారు. గేలిచేసేరు విమర్శించేరు.

కానీ ఏ ఒక్కరూ ఆలోచించలేదు— నాటకాలనే నమ్ముకుని జీవనం గడుపుకొస్తున్న అతని దైన్య స్థితి గురించి. సగటు తెలుగు నటుడు క్షయతో కృశించవలసి వస్తున్న పరిస్థితి గురించి, స్టేజీ మీద హీరో పాత్రకు అన్యాయం జరుగుతోందని అంతా విచారించేరు. నిజ జీవితంలో నటుడికి జరుగుతున్న అన్యాయం గురించి ఎవరూ విచారించలేదు. *


*Phone : 35334*

**DHANRAJ TEXTORIUM**

**FOR SAREES OF ALL VARIETIES**

**SUITINGS & SHIRTINGS**

**Dwaraka Building, Lakdi-ka-phool**

**HYDERABAD–500 004.**